క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో హోమ సహిత సుహాసినీ పూజ



అలంకరణలో మానసాదేవి

కడప కల్చరల్ : స్థానిక దస్తగిరిపేటలోని మానసాదేవి ఆలయంలో బుధవారం హోమ సహిత సుహాసినీ పూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మానసాదేవి ఉపాసకులు శివస్వామి ఆధ్వర్యంలో మహాచండీ, రుద్ర సహిత గణపతి, నవగ్రహ, లక్ష్మీ కుబేర హోమం, అర్చన నిర్వహించారు. అనంతరం సామూహికంగా సుహాసిని దేవి పూజ చేయించారు. ఆలయ సభ్యులు అన్న ప్రసాద వితరణ చేశారు.

నంద్యాల ఉర్దూ సెమినార్‌కు ఎంపిక

కడప ఎడ్యుకేషన్ : నంద్యాల మజ్లిసుల్ వల్ ఆయిమా(ఇమాముల సంఘం) ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన జరిగే సీమ స్థాయి ఉర్దూ సెమినార్‌కు కడప ఉర్దూ సాహితీవేత్తలు సత్తార్ ఫైజి, మగ్బూల్‌అహ్మద్‌లకు ఆహ్వానం అందింది. ప్రముఖ ఉర్దూ సాహితీవేత్త సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ జయంతి సందర్భంగా నంద్యాల అంజుమన్ షాదీ ఖజానాలో జరిగే ఈ సెమినార్‌లో పరిశోధన పత్రాలు సమర్పించాలని నిర్వాహకులు హాఫీజ్ అంజద్‌బాషా వారికి ఆహ్వానం పంపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ.ఫరూఖ్ హాజరు కానున్నారు.

కడప డీఎఫ్ఓగా వినీత్‌కుమార్



కడప డీఎఫ్ఓగా బాధ్యతలను చేపట్టిన వినీత్‌కుమార్‌తో బదిలీపై వెళుతున్న డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా కడప డివిజనల్ ఫారెస్ట్ అధికారిగా వినీత్‌కుమార్ బుధవారం సాయంత్రం కడపలోని అటవీశాఖ కార్యాలయంలో బాధ్యతలను చేపట్టారు. ఈయన అనంతపురం డీఎఫ్ఓగా పనిచేస్తూ ఇటీవల బదిలీపై కడప డీఎఫ్ఓగా నియమితులయ్యారు. విధుల్లోకి చేరిన ఆయన మాట్లాడుతూ జిల్లాలో అటవీ సంపద సంరక్షణకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకుంటామన్నారు. కడప డీఎఫ్ఓగా పనిచేసిన సందీప్‌రెడ్డి పాడేరు డీఎఫ్ఓగా బదిలీ అయ్యారు. ఈక్రమంలో డీఎఫ్ఓ వినీత్‌కుమార్‌కు, బదిలీపై వెళుతున్న డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఒకరినొకరు మర్యాదపూర్వకంగా కలుసుకుని విధులపై చర్చించారు.

వాన కురిస్తే.. నీరు నిలిస్తే

- అకాల వర్షాలకు రహదారులు జలమయం
- నగరంలో స్తంభించిన జన జీవనం

కడప కార్పొరేషన్/కోటిరెడ్డి సర్కిల్: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో కడపలో మంగళవారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కడప నగరంలో రోడ్లు,. డ్రైనేజీ ఏకమై వీధుల్లో నీరు ఏరులా ప్రవహించింది. ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనదారులు రోడ్డుపై నడిచి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంచుమించు నగరంలో చాలా చోట్ల మురుగునీరు, వర్షపు నీటితో కలిసి ప్రవహిస్తూ ఉండటంతో కాలు తీసి నడవలేని పరిస్థితి. పాఠశాల, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించినా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు యథావిధిగా పనిచేశాయి. ఉద్యోగులు, ఇతరులు గొడుగులు చేతబట్టి నిలిచిన నీటిలో నడుస్తూ అపసోపాలు పడాల్సి వచ్చింది. రోడ్లపై దుకాణాలు పెట్టే చిరు వ్యాపారులు ఇంటికే పరిమితమయ్యారు. రైతు బజార్‌లో వినియోగదారులు కూరగాయలు కొనుక్కునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రహదారులపై జనజీవనం పూర్తి స్థాయిలో స్తంభించింది. ఎస్‌బీఐ కాలనీ, ప్రకాష్ నగర్, వరద కాలనీ, తిలక్‌నగర్, ఆర్‌కే నగర్, అశోక్ నగర్, గంజికుంట కాలనీ, గౌస్‌నగర్, ఖలీల్ నగర్, పాతకడప, ఊటుకూరు, మామిళ్లపల్లె, చౌటపల్లె, ఇందిరా నగర్, వైఎస్సార్ కాలనీ, మరియాపురం ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. కడప నగర శివార్లలో ఉన్న 48 డివిజన్‌లోని కృపా కాలనీ, బుడగజంగం కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, లోహియా నగర్, యానాది కాలనీ, అహ్మదీయ నగర్ ప్రాంతాలు వర్షంతో జలమయమయ్యాయి. వినాయకనగర్, ఆర్టీసీ బస్టాండు, గురుకుల్ విద్యాపీఠ్, అప్సర కూడలి ప్రాంతాల్లో రహదారులపై వర్షం నీరు నిలిచింది. పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



నగరంలో.. ఉదయం 10 గంటలు కావస్తున్నా.. నిర్మానుష్యమే



వన్‌టౌన్ సర్కిల్ వద్ద..



ఎన్జీఓ కాలనీలో వర్షపు నీటిలో కారు



ట్రాఫిక్ పాయింట్‌లో కానిస్టేబుల్





వినాయకనగర్ సర్కిల్‌లో నిలిచిన నీరు



ఎస్‌బీఐ కాలనీలోని ఓ వీధిలో నిలిచిన వర్షపు నీరు





వర్షంలో గొడుగు నీడన బైక్‌పై ప్రయాణికుల ఇబ్బందులు



వర్షంలోనే చిరు వ్యాపారులు



కడప నగరం అప్సర హాల్ వద్ద..



పోస్టాఫీసు ఎదుట బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



పాత కలెక్టరేట్ వద్ద ఫుట్‌పాత్‌లో నిరుపేదల ఇక్కట్లు

మహ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయం

కడప కార్పొరేషన్ : మహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గం అనుసరణీయమని మేయర్ కె.సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. స్థానిక రాజాఖాన్ బాగ్ మసీదు వద్ద వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత మున్నా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్యార్మీ కార్యక్రమంలో వారు పాల్గొని ఫాతేహా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదానం పుణ్యకార్యమని, మహ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్.ఇలియాస్, షఫీ, దాసరి శివప్రసాద్, అజ్మతుల్లా, ఇస్మాయిల్, సలీం, సాహెబ్, బన్నా పాల్గొన్నారు.



ఫాతేహా నిర్వహిస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

ఉరుసు ఉత్సవాలకు ఆహ్వానం

కడప కల్చరల్ : ప్రముఖ పర్యాటక సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రం కడప అమీన్‌పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేన్ సాహెబ్ ఆహ్వానించారు. డిప్యూటీ సీఎంను ఆయన కార్యాలయంలో కలిసిన పీఠాధిపతి ఈ మేరకు నవంబరు 16 నుంచి 21వ తేదీ వరకు జరగనున్న ఉరుసు ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దర్గా మేనేజర్ ఎస్ఎండీ అలీ, ముజావర్ అమీర్‌లు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

కమలాపురం : ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తున్నాయని అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని కడప ఆర్డీఓ జాన్ ఎరివిన్ పులపర్తి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. పట్టణంలో సకాలంలో రేషన్ పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలనుంచి అందిన సమస్యలు అలాగే రైతులకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. బెంగలూరు, విజయవాడ 6 లైన్ల రహదారి, కమలాపురం బైపాస్‌కు సంబంధించి భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

చెన్నూరులో సామాజిక తనిఖీ

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలో 18వ విడత (2023–24) సామాజిక తనిఖీ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించారు. సోషల్ ఆడిట్ కార్యక్రమంలో 12000 రికవరీ పెట్టడం జరిగింది. అందులో రూ.2500 రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ ప్రిసైడింగ్ అధికారిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌యాదవ్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, ఉపాధి హామీ సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యా సంస్థలకు దూరంగా మద్యం షాపులు

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : కడప కార్పొరేషన్ పరిధి చింతకొమ్మదిన్నె మండలం నుంచి విలీనమైన 15, 16వ డివిజన్లలో నూతనంగా ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలను విద్యాసంస్థలు, ప్రార్థన మందిరాలకు దూరంగా తరలించాలని ఆర్‌సీపీ మండల కార్యదర్శి మడగలం ప్రసాద్ కోరారు. కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, కడప, కమలాపురం ఎమ్మెల్యేలకు కూడా విన్నవించామన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు

కడప కార్పొరేషన్ : వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర సిబ్బందిని ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా అశోక్ నగర్, అప్సర సర్కిల్, వై–జంక్షన్, గురుకుల్ విద్యాపీఠం, వినాయకనగర్ సర్కిల్ ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జట్టింగ్ మిషన్ సాయంతో కడప కోర్టు నుంచి ఆర్టీసీ సర్కిల్ వరకూ ఉన్న నీటిని తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు ధనలక్ష్మి, నారాయణస్వామి, డీఈ వేణుగోపాల్, ఏఈలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర

వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ కార్పొరేటర్ జయచంద్రారెడ్డి సోదరుడు రిటైర్డ్ వార్డెన్ పొట్టిపాటి రామక్రిష్ణారెడ్డి(67) బుధవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు వారి స్వగృహానికి వెళ్లి రామక్రిష్ణారెడ్డి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. శుక్రవారం రాజంపేట తాలూకా సీతారాంపురంలో అంత్యక్రియలు జరుగుతాయని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు షఫీ, అజ్మతుల్లా, తోటక్రిష్ణ, రాణా ప్రతాప్, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.



సుబ్బారెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

మది నిండా సంబరం



శ్రీహరికోటలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

రోజూ పాఠ్య పుస్తకాలతో
కుస్తీ పట్టే చిన్నారులను..
సరికొత్త ప్రదేశాలకు పంపితే
తనవి తీరా ఆనందిస్తారు.
ఉన్న ఊరు నుంచి ఏ పర్యాటక
ప్రాంతానికి తీసుకెళ్లినా వారి
ఆనందానికి అవధులుండవు.
అల్లరికి బ్రేకులుండవ్. ఆ అవకాశాన్ని
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు
కల్పించారు వైఎస్సార్‌జిల్లా కలెక్టర్
లోతేటి శివశంకర్. ఆ మరుపురాని
ప్రదేశాలను వీక్షించి.. విజ్ఞానం సాధించామని చెబుతున్నారు
విద్యార్థులు.

- తరగతి గది నుంచి.. విజ్ఞాన లోకంలోకి విద్యార్థులు
- కలెక్టర్ చొరవతో ఆరు రోజుల విహార యాత్ర

కడప ఎడ్యుకేషన్ : దేశంలోని విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, ప్రసిద్ధ ప్రాంతాలను చూడడం పేద విద్యార్థులకు వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. అయితే విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసిన వారికి రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు, క్షేత్రాలను ఏపీ దర్శన్ పేరుతో విహార యాత్ర చేసే అవకాశాన్ని కల్పించారు వైఎస్సార్ జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్. పదో తరగతి చదివే విద్యార్థులకు ప్రత్యేక ప్రతిభా పరీక్ష నిర్వహించి టాప్ మార్కులు వచ్చిన 500 మంది బాల, బాలికలను ఈ యాత్రకు ఎంపిక చేశారు. ఎంపికైన వారి వద్ద నామినల్ డబ్బు తీసుకుని మిగిలిన రవాణా, వసతి, ఇతరత్రా సౌకర్యాల ఖర్చులను కలెక్టర్ సమకూర్చారు. దీంతో విద్యార్థులు ఉత్సాహంగా ఆయా ప్రదేశాలకు ఉత్సాహంగా గడిపారు.

దర్శించిన ప్రాంతాలివే..

దసరా సెలవుల నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు శ్రీకాళహస్తి, శ్రీహరికోట, పులికాట్ సరస్సు, కొండవీడుకోట, అమరావతి బౌద్ధ క్షేత్రాలు, విజయవాడ, అన్నవరం, సింహాచలం, విశాఖపట్నం, కాకినాడ, బొర్రగుహలు, పోలవరం, అరకులోయ ప్రాంతాలను విద్యార్థులు ఏపీ దర్శన్ యాత్ర పేరుతో దర్శించుకున్నారు. ఈ విహార యాత్రలో రాష్ట్ర వ్యాప్తంగా శాస్త్ర సాంకేతిక ప్రదేశాలు, వివిధ సంస్కృతులు గల పుణ్య క్షేత్రాలు, ప్రకృతి వనరులు, సహజసిద్ధంగా ఏర్పడిన ప్రదేశాలను సందర్శించి మంచి అనుభూతిని పొందారు. పర్యాటక పరిజ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశం లభించడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. తమకు మరిచిపోలేని జ్ఞాపకాలను మిగిల్చిందని విద్యార్థులు తమ మనోగతాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

బాగా చదువుకోవాలనే స్ఫూర్తి నింపింది



ఏపీ దర్శన్ యాత్ర నాకు బాగా చదువుకోవాలనే స్ఫూర్తి నింపింది. ఎప్పుడు ఇల్లు, స్కూల్ తప్ప మరో ప్లేస్ నేను చూడలేదు. ఇపుడు ఆరు రోజుల పాటు టూర్‌కు వెళ్లి పలు రకాల ఊళ్లు, మనుషులను చూడటంతోపాటు ఆ కల్చర్ గురించి తెలుసుకున్నాం. అన్ని పరిశీలించా బాగా చదువుకుంటే ఇలా ఉండవచ్చని తెలిసింది.

– లాస్య ప్రియ, 10వ తరగతి, విద్యార్థిని

సైన్సు పరిజ్ఞానం తెలిసింది



శ్రీహరికోటలోని రాకెట్ లాచింగ్ కేంద్రాన్ని చూశాం. అక్కడ శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయోగాలు, రాకెట్‌ను నింగిలోకి పంపితే కలిగే లాభాల గురించి తెలుసుకున్నాం. దీంతో సైన్సు పరిజ్ఞానంపై అవగాహన వచ్చింది. భవిష్యత్తులో మేము కూడా బాగా చదువుకుని మంచి స్థాయికి ఎదగాలనే ఆలోచనలు రెకెత్తించింది.

– గణేష్, 10వ తరగతి, విద్యార్థి

చాలా సంతోషంగా ఉంది..



విద్యా శాఖ ఏర్పాటుచేసిన టూర్‌కు వెళ్లి వచ్చిన తరువాత నాకు చాలా సంతోషంగా ఉంది. ఎందుకుంటే సముద్రం, బెలూన్ గుహలు, ఇస్రో సెంటర్, అన్నవరం ఇలాంటి పేర్లను పుస్తకాల్లోనే చదివానేగానీ.. ఎప్పుడూ ప్రత్యక్షంగా చూడలేదు. ఈ టూర్‌లో వాటన్నింటినీ చూడడం చాలా సంతోషంగా ఉంది.

– భార్గవి, 10వ తరగతి విద్యార్థిని

కల్చర్ గురించి తెలిసింది..



ఈ టూర్‌తో విశాఖపట్నం, కాకినాడ, అన్నవరం ప్రాంతాల వారి పద్ధతులు చాలా బాగా నచ్చాయి. ఎదుటి వారితో మాట్లాడే తీరు, ఇచ్చే గౌరవం గురించి నాకు తెలిసి వచ్చింది. ఈ టూర్ వల్ల నాకు కల్చర్ బాగా అర్థమైంది. దీంతోపాటు అందరినీ చూసిన తర్వాత ఇంకా చదువుకోవాలనే స్ఫూర్తి రగిల్చింది.

– జశ్వంత్, 10వ తరగతి విద్యార్థి